క్లుప్తంగా

పారిశుధ్య కార్మికుడి ఆకస్మిక మరణం



మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న డీపీఓ, సర్పంచ్

ఐరాల: మండలంలోని కాణిపాకం గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు విశ్వనాథం మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు, డీపీఆర్సీ కో–ఆర్డినేటర్ షణ్ముగం, ఈఓపీఆర్డీ కుసుమకుమారి గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు నిర్వహణకు గ్రామ పంచాయతీ తరఫున రూ.5 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు.

యాజమాన్య పద్ధతులు లాభదాయకం



మాట్లాడుతున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: యాజమాన్య పద్ధతులతో సాగు చేస్తే వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని ఏఓ వరలక్ష్మి సూచించారు. మండలంలోని చిన కాంపల్లెలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పొలం పిలుస్తోంది ముఖ్య ఉద్దేశం రైతులకు వ్యవసాయం లాభసాటిగా చేయాలని తెలియజేశారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ప్రకృతి వ్యవసాయంతో సాధించవచ్చని తెలిపారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలని చెప్పారు. అనంతరం ఆర్‌ఎస్‌కేలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి వీపీఏకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. గడువులోపు రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీపీఏ, రైతులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను విస్మరించిన బడ్జెట్



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ప్రజలు తిరస్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల్లో కొనుగోలు శక్తి కుచించుకుపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను బడ్జెట్‌లో పూర్తిగా విస్మరించారని చెప్పారు. అవసరం ఉన్నప్పటికీ ఉపాధిహామీ పథకానికి నిధులు అదనంగా కేటాయించలేదన్నారు. ధరల పెరుగుదల, జీఎస్టీ పెంపుదలతో అనేక ఇబ్బందులు పడుతున్న కార్మికవర్గాన్ని ఈ బడ్జెట్‌లో విస్మరించిందన్నారు. జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు సురేంద్రన్, ఓబుల్‌రాజు, మురళీ, బాలసుబ్రమణ్యం, నాయకులు గోపీనాథ్, దాసరి చంద్ర, రమాదేవి, విజయగౌరీ పాల్గొన్నారు.

ఇది అన్నదాత విశిష్ట ఆధార్

కేంద్ర ప్రభుత్వం భారత పౌరులకు 12 అంకెలతో అందించిన ఆధార్ కార్డు తరహాలో అన్నదాతలకు గుర్తింపు సంఖ్యతో మరో విశిష్ట కార్డు అందిస్తోంది. ఈ 14 అంకెలు కలిగిన రైతు విశిష్ట గుర్తింపు కార్డు ఉంటేనే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల పథకాలు, రాయితీలు, రుణాలు అందుతాయని స్పష్టం చేసింది. అందుకోసం రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా అధికారులు విరివిగా ప్రచారం చేశారు. నియోజకవర్గంలో రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియ ఇప్పటికే ముమ్మరంగా సాగుతోంది. రైతులందరూ ఆయా కేంద్రాల్లో గంటల తరబడి నిరీక్షించి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు.



తవణంపల్లె: మారేడుపల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ ఉమ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రైతులకు ప్రత్యేక గుర్తింపు పత్రం ఇచ్చేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాగు భూమి ఉన్న ప్రతి రైతుకు 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య పత్రం జారీ చేసేందుకు సిద్ధమైంది. వివిధ పథకాల అమలుకు ఇది తప్పనిసరి కానుంది. ఇప్పటికే దీనిపై మండల వారీగా ప్రక్రియను ప్రారంభించారు.

జిల్లాలో రబీ సీజన్ దృష్ట్యా ప్రస్తుతం 4వేల హెక్టార్లల్లో వరి సాగవుతోంది. దీంతో పాటు వేరుశనగ, కంది, ఉలవలు వంటి వ్యవసాయ పంటలతో పాటు మామిడి, దానిమ్మ, బొప్పాయి, జామ, సపోట లాంటి ఉద్యాన పంటలు, చామంతి, కూరగాయాలు, మల్లె తది తర పూల సాగు చేపడుతున్నారు. జిల్లాలో 1.50 లక్షల మంది రైతు భరోసా ద్వారా లబ్ధి పొందే రైతులున్నారు. వీరందరూ ఈ సంఖ్యను పొందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలి

తవణంపల్లె: రైతులు విధిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏడీ ఉమా సూచించారు. మండలంలోని ఉత్తరబ్రాహ్మణపల్లె, వడ్డిపల్లె, మారేడుపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సందర్శించారు. ఏడీ మాట్లాడుతూ ప్రతి రైతు విధిగా రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి విశిష్ట సంఖ్యను పొందాలని సూచించారు. దీని ద్వారానే భవిష్యత్తులో రైతులకు పథకాల అందుతాయని తెలిపారు. ఏఓ ప్రవీణ్ మాట్లాడుతూ సేంద్రియ సాగుపై ఆసక్తి చూపాలన్నారు. వీఏఏలు జ్యోతి, లిఖిత, వాణి, పశుసంవర్ధక శాఖ సహాయకులు లావణ్య, సేంద్రియ సాగు సిబ్బంది పాల్గొన్నారు.

నమోదు ఇలా...

రైతులు 14 అంకెల గుర్తింపు (యునిక్ ఐడీ) సంఖ్య నమోదు. ప్రక్రియ అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రారంభించారు. సొంత భూమి కలిగిన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి. పట్టాదారు పాసుపుస్తకం నకలు (జిరాక్స్) లేదా 1–బి, ఆధార్ పత్రం, ఆధార్‌తో అనుసంధానం అయిన సెల్ నంబరు వివరాలు ఇస్తే సిబ్బంది నమోదు చేస్తారు. అనంతరం రైతు ఇచ్చిన సెల్ నంబరుకు 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య వస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు, కార్యక్రమాలు, పీఎం కిసాన్, పెట్టుబడి, ఎరువులు రాయితీలు, పంటల బీమా, దిగుబడుల విక్రయానికి అర్హత, అవసరమైన పంట రుణాలు పొందడానికి ఈ సంఖ్య తప్పనిసరి కానుంది. ఈ నేపథ్యంలో అందరూ కచ్చితంగా తీసుకోవాలని వ్యవసాయశాఖ అధి కారులు కోరుతున్నారు..

చేసుకుంటే ఉపయోగాలు



సాగు భూమి ఉన్న ప్రతి రైతు 14 అంకెలున్న ప్రత్యేక గుర్తింపు సంఖ్య పొందాలి. లేదంటే ప్రభుత్వం అమలుచేసే పథకం, కార్యక్రమాల ద్వారా అందే రాయితీలు, సాయం అందదు. భవిష్యత్తులో రైతుకు ఇదే ప్రధానం కానుంది. రైతు భరోసా కేంద్రాల్లో వివరాలు అందజేస్తే వెంటనే నమోదు చేస్తారు. దీనిపై గ్రామాల్లో కూడా అవగాహన కల్పిస్తున్నాం. రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి.

–మధురవాణి, ఏఓ, పూతలపట్టు

డీఐఓ అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం మాపాక్షిలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌ను మంగళవారం డీఐఓ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది హాజరును చూశారు. అనంతరం ఆర్‌బీఎస్‌కే సర్వేపై ఆరా తీశారు. క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యాధినిరోధక టీకాల విషయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. క్రమం తప్పకుండా పిల్లలకు టీకా వేయించాలని సూచించారు.

గుండెపోటుకు స్టెమీ భరోసా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పూతలపట్టు(కాణిపాకం): గుండెపోటుకు స్టెమీ కార్యక్రమం భరోసా కల్పిస్తుందని వైద్యులు ప్రియాంక, ప్రవీణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం స్టెమీపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం గుండె బాధితులకు అండగా నిలుస్తూ, రూ.45 వేలు విలువ చేసే ఇంజెక్షన్‌ను ఉచితంగా అందిస్తోందన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వారు పేర్కొన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యులు కుమార రాజ, వెంకటేశ్వరరావు, సిబ్బంది శ్రీనివాస మూర్తి, నూర్జహాన్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

ఐరాల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని కాణిపాకం వైద్యాధికారులకు జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఆదేశించారు. కాణిపాకం పీహెచ్‌సీని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, ఓపీ వివరాలు, ల్యాబ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన చెంగనపల్లెలో పర్యటించి మాట్లాడారు. గ్రామాల్లో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు స్వాతి సింధూర, రాజేశ్వరి, ఎంపీహెచ్ఈఓ శివయ్య, పబ్లిక్ హెల్త్ నర్స్ వేదవతి, హెల్త్ సూపర్‌వైజర్లు మనోహర్, నారాయణ, నాగరత్నమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి



విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ ధనలక్ష్మి

ఐరాల: ఈ ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాల ని విద్యార్థులకు ఎంపీడీఓ ధనలక్ష్మి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. ఎంపీడీఓ పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ భౌతికశాస్త్రం, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులు కీలకమని, వాటిపై ఎక్కువగా దృష్టి సారించాలని సూచించారు. కష్టతరమైన సబ్జెక్టులపై విద్యార్థులు పూర్తి స్థాయిలో పట్టు సాధిస్తే మంచి ఫలితాలను పొందే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు ఇప్పటి నుంచే ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో పాల్గొని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ దామోదర్‌నాయుడు, హెచ్‌ఎం కోమల పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



హాస్టల్లో వసతులపై ఆరా తీస్తున్న సుధారాణి

బంగారుపాళెం: విద్యార్థుల ఆరోగ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్యాధికారి, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ సుధారాణి ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, బీసీ వసతి గృహం, దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థుల వసతి, సౌకరాలపై వార్డన్‌ను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ ఆవరణను పరిశీలించారు. బాలికలకు ఒకటే కామన్ టాయిలెట్, పిల్లలు అందరికీ ఒకటే హాల్ ఉండడంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుస్తోందన్నారు. ఈ విషయాన్ని బాలికలు కూడా ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. హాస్టల్‌ను నూతన భవనంలోకి మార్పు చేసేందుకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళతానన్నారు. బాలికల భద్రతపై సంక్షేమ వసతి గృహాల వార్డెన్లు జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న పౌష్టిక ఆహారం, అందిస్తున్న విద్య గురించి అంగన్‌వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధిత సంబంధిత అధికారులపై ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్, సూపర్‌వైజర్ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణులకు ఇంటి వద్దనే వైద్యం







తవణంపల్లె: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్, గుడిపాల: వైద్యసేవల్లో డాక్టర్ చంద్రమహేష్, ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణులకు ఇంటి వద్దనే వైద్య సేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని నాంపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 60 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే వైద్యం

గుడిపాల: ప్రజల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నట్లు స్థానిక ప్రాథమిక వైద్యాధికారి చంద్రమహేష్ తెలిపారు. చిత్తపార గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 60 మందికి వైద్యసేవలు అందించారు. మంచానపడ్డ రోగులకు ఇంటివద్దే వెళ్లి పరీక్షలు చేశారు. గర్భిణులు, బాలింతలకు రక్తపరీక్షలు చేసి చికిత్సలు అందించారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని ఆయన సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది విజయ, చంద్రశేఖర్, సంధ్య, హేమలత, మంజుల, ఇందుమతి పాల్గొన్నారు.

రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

తవణంపల్లె: గర్భిణులు రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి వినయ్‌కుమార్ సూచించారు. మండలంలోని దిగువ మత్యంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఐరన్ మాత్రలతో పాటు తాజా ఆకు కూరలు, కూరగాయలు భుజించాలని వివరించారు. అనంతరం గర్భవతులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నివాళి

ఐరాల: మండలంలోని కాణిపాకంకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత సుధీర్ తండ్రి నాగరాజు(65) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సుధీర్‌ను ఓదారుస్తున్న సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్

ప్రభుత్వ భవనాలు ప్రారంభం



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

గుడిపాల: మండలంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలను, సిమెంట్ రోడ్లను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో వెనకడుగు వేయనన్నారు. కిల్లారిపల్లె, గుడిపాల లేఅవుట్, అడవిచేను, పాపసముద్రం, వెప్పాలమానుచేను, బండపల్లె, చిత్తపార గ్రామాల్లో సీసీరోడ్లను ఆయన ప్రారంభించారు. చిత్తపార సచివాలయం, గుడిపాల రైతు భరోసా కేంద్రం, పిళ్లారికుప్పంలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. బండపల్లెలో గుడి కట్టేందుకు తమకు నిధులు కావాలని కోరగా ఆయన రూ.50 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయంతి, ఎంపీడీఓ శివరాజన్, ఏఈలు ప్రసాద్, పవన్, చిత్తూరు మేయర్ అముద, నాయకులు సుబ్బానాయుడు, బాలాజీ, గోళ్ల హరిప్రసాద్, సాంబశివనాయుడు, సుమతి, చిట్టిబాబు, అనిల్, సర్పంచులు పాల్గొన్నారు.

రైతులకు చాప్ కట్టర్ల పంపిణీ



పాడి రైతులకు అందజేసిన చాప్‌కట్టర్లు

గుడిపాల: మండలంలో పాడి రైతులకు మంగళవారం చాప్ కట్టర్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోగన్ 9 మంది రైతులకు వీటిని అందజేశారు. ఒక్కో చాప్‌కట్టర్ విలువ రూ.33,970 ఉండగా ఇందులో ప్రభుత్వ సబ్సిడీ రూ.13వేలు ఇవ్వగా రైతు వాటా కింద రూ.20,382కి అందించినట్లు చెప్పారు. మండలానికి 23 మంది పాడి రైతులకు చాప్ కట్టర్లను కావాలని ప్రభుత్వానికి నివేదికలు పంపగా మొదటి విడతలో 9మందికి చాప్ కట్టర్లు అందించినట్లు చెప్పారు. మిగతా 14 మందికి త్వరలోనే అందిస్తామని పశువైద్యాధికారి సాయిసుధ తెలిపారు.

మొగిలిలో ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం



ఆలయానికి వెల్లవేస్తున్న పెయింటర్



మొగిలి శివాలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న కూలీలు

బంగారుపాళెం: మండలంలో దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న మొగిలి స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు జోరుగా ఏర్పాట్లు చేశారు. మొగిలీశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23వ తేదీ ప్రారంభమై మార్చి 5వ తేదీ ముగియనున్నాయి. ఈ ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ పరిసరాలను శుభ్రం చేయించారు. ఆలయానికి వెల్ల వేశారు. భక్తులు సేద తీరేందు కోసం చలువ పందిళ్లను వేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వేలాది మంది భక్తులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉచిత దర్శనంతో పాటు స్పెషల్ దర్శనం రూ.10, శీఘ్ర దర్శనం రూ.30కు ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

మెరుగైన ఏర్పాట్లు

మొగిలీశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తుల కోసం మెరుగైన ఏర్పాట్లను చేపడుతున్నాం. భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని తగిన చర్యలు తీసుకుంటున్నాం. బ్రహ్మోత్సవాలలో మహాశివరాత్రి, కల్యాణోత్సవం, బ్రహ్మరథోత్సం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నాం. బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్నిశాఖల అధికారులు, ఉభయదారులు, గ్రామస్తుల సహకారంతో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– మునిరాజ, శివాలయం ఈఓ, మొగిలి

ఉపవాసంతో సత్ఫలితాలు

మహాశివరాత్రి పర్వదినం రోజున ఉపవాసదీక్షతో ప్రదక్షిణ, జాగరణ చేయడం ద్వారా ముక్తి, మోక్షం లభిస్తుంది. త్రయోదశితో కూడిన మహాశివరాత్రి రావడంతో విశిష్టత ఉంది. మాఘ కృష్ణ చతుర్దశిని(బహుళ చతుర్దశి) మహా శివరాత్రిగా చెబుతారు. 24 గంటల పాటు ఉండే శివరాత్రి రోజున శివనామస్మరణ చేయడం ద్వారా మంచి ఫలితాలు లభిస్తాయి. స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి వారిని పూజించడం ద్వారా భోగ, మోక్షం కలుగుతాయి.

– రెడ్డెప్పగురుకుల్, ఆలయ ప్రధాన అర్చకులు, మొగిలి

23న ఉచిత కంటి వైద్య శిబిరం

కాణిపాకం: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని ఆస్థాన మండపంలో ఈ నెల 23వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. అరవింద ఐ ఆస్పత్రి సహకారంతో ఈ శిబిరం జరుగుతుందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించే శిబిరాన్ని భక్తులు, ఆలయ అధికారులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.